సరస్వతీ నమస్తుభ్యం..



సోంపేట: బారువ కనక దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

వసంతపంచమి సందర్భంగా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలతోపాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలతో ఓంకారం రాయించగా.. అర్చకులు ఆశీర్వాచనాలు అందించి విద్యాబుద్ధులు చేకూరాలని దీవించారు. పంచమి సందర్భంగా ఆధ్యాత్మిక శోభ నెలకుంది.

–సాక్షి నెట్‌వర్క్



టెక్కలి రోటరీనగర్‌-2లో సామూహిక అక్షరాభ్యాసాలు చేస్తున్న చిన్నారులు



కవిటి: సహలాలపుట్టుగ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించిన సరస్వతీ విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం



కాశీబుగ్గ: జ్ఞానసరస్వతీ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసంలో చిన్నారులు, తల్లిదండ్రులు



వజ్రపుకొత్తూరు రూరల్‌: నువ్వలరేవు పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాలు చేయిస్తున్న ఉపాధ్యాయులు

కంప్యూటర్‌ కోర్సులో ఉచిత శిక్షణ

టెక్కలి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్‌ హబ్‌ సెంటర్‌లో కస్టమర్‌ కేర్‌ ఎగ్జిక్యూటీవ్‌ డొమెస్టిక్‌ నాన్‌ వాయిస్‌ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ టి.గోవిందమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి.. ఆపైన చదువుకున్న నిరుద్యోగ యువత ఈ నెల ఏడో తేదీలోగా అన్ని ధ్రువపత్రాలతో కళాశాలలోని హబ్‌ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. మూడు నెలల పాటు శిక్షణ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94932 90012 నంబరును సంప్రదించాలన్నారు.

వేరే పాఠశాలలో తరగతుల విలీనం వద్దు

కంచిలి: మండలంలోని కొండపోలేరు ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను వేరే పాఠశాలలో విలీనం చేయవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారంతా స్థానిక ఎంఈవో ఎస్‌.శివరాంప్రసాద్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం 28 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారని, 3, 4, 5 తరగతుల్లో 15 మంది విద్యార్థులున్నారన్నారు. వీరిని ఇదే పంచాయతీ కేంద్రం పోలేరు పాఠశాలలో విలీనం చేయడానికి ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలిసిందని, ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. తమ గ్రామంలో 2018–19 విద్యా సంవత్సరం నుంచి గ్రామంలో ఏఒక్క విద్యార్థిని కూడా ప్రైవేటు పాఠశాలలో చదవకుండా జాగ్రత్త పడుతున్నామని, ఇటువంటి తరుణంలో ఉన్న పాఠశాలలో మూడు తరగతులను తరలిస్తే మళ్లీ ఇక్కడి విద్యార్థులు ప్రైవేటు బాట పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఈవోను కలిసిన వారిలో ఎస్‌ఎంసీ చైర్మన్‌ బి.రోజా, డి.హేమలత తదితరులున్నారు.



ఎంఈవో శివరాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సప్తమి పూజలకు సూర్యనారాయణస్వామి ఆలయం ముస్తాబు



టెక్కలి సూర్యనారాయణస్వామి ఆలయం

టెక్కలి: ఆరోగ్య ప్రదాత సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రథసప్తమి సందర్భంగా ఆదిత్యునికి ప్రత్యేక పూజల కోసం టెక్కలిలోని సూర్యనారాయణస్వామి ఆలయం ముస్తాబైంది. స్థానిక పాత జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆలయంలో సప్తమి ప్రత్యేక పూజల కోసం ఏర్పాట్లు చేశారు. టెక్కలితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడా సూర్యనారాయణస్వామి ఆలయం లేకపోవడంతో ఏటా ఈ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇదే క్రమంలో ఈ ఏడాది సైతం రథసప్తమికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పూజలకు వచ్చే భక్తులకు ఎటువంటి అవస్థలకు గురి కాకుండా ఆలయ నిర్వాహకులతో పాటు గుడ్‌ఫ్రెండ్స్‌ యూత్‌, మాజీ సైనికులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

వేకువజాము నుంచి పూజలు

రథసప్తమి సందర్భంగా సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత 12.30 నుంచి రెండు గంటల వరకు క్షీరాభిషేకాలతో పాటు ఆరోగ్యప్రదాతకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం సర్వదర్శనాలు జరుగుతాయి.

రికార్డులు పక్కాగా ఉండాలి

ఇచ్ఛాపురం రూరల్‌: సెర్ప్‌కు సంబంధించి కమ్యూనిటీ ఆడిట్‌ జరుగుతున్నందున సంఘాలకు చెందిన రిజిస్టర్లు పక్కాగా ఉండేలా చూడాలని ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. సోమవారం తన కార్యాలయంతో సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, గ్రామ సంఘంపై వీవోఏలతో చర్చించారు.

పురస్కారం ప్రదానం

ఇచ్ఛాపురం రూరల్‌: మహతీ సాంస్కృతిక కళా సేవా సంస్థ గౌరవ సభ్యుడు, ఏపీ మందుల వర్తకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగాల జానకీరామ్‌ స్వామి వివేకానంద ఇండియన్‌ ఐకాన్‌ నంది పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు సాంస్కృతిక, జానపద విభాగంలో ఆయన చేస్తున్న కృషికి సోమవారం విజయవాడ రాధిక తుమ్మనపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు–2025 సందర్భంగా ప్రముఖుల చేతులు మీదుగా పురస్కారాన్ని పొందారు.

క్యాన్సర్‌ వ్యాధిపై అవగాహన



క్యాన్సర్‌ లోగో ఆకృతిలో విద్యార్థులు

సోంపేట: క్యాన్సర్‌ వ్యాధిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక సంస్కారభారతి కళాశాల కరస్పాండెంట్‌ డాక్టర్‌ నిమ్మన దాస్‌, చైర్మన్‌ ఎన్ని దేవరాజు అన్నారు. ప్రపంచ క్యాన్సర్‌ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు క్యాన్సర్‌ లోగో ఆకృతిగా ఏర్పడ్డారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

మందస: మందస మండలం బలి గాం గ్రామంలోని మండల పరిషత్‌ స్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు ఉదారాతను చాటుకున్నారు. తమ వంతుగా స్టేషనరీలో భాగంగా రూ. 23 వేల విలువైన కలర్‌ ప్రింటర్‌ను మంద స ఎంఈవో మర్రిపాటి లక్ష్మణరావు సమక్షంలో సోమవారం అందజేశారు. పూర్వ విద్యార్థులు గున్న సాయి, భావన సతీష్‌, ఆరింగి శ్రీకాంత్‌, హెచ్‌ఎం బి.భారతి ఉన్నారు.

స్కేటింగ్‌లో రాణించిన చిన్నారులు

సోంపేట: తమిళనాడు రాష్ట్రం మదురై పట్టణంలో స్పీడ్‌ స్కేటింగ్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన 24వ జాతీయ స్థాయి స్పీడ్‌స్కేటింగ్‌ పోటీల్లో సోంపేటకు చెందిన చిన్నారులు పలు పతకాలు సాధించి సత్తాచాటారు. తెలుకుల అన్విక శ్రీ, విష్ణువర్దన్‌, సుమంత్‌, విజయ్‌, కౌశిక్‌ తదితరులు పతకాలు సాధించగా వీరిని.. శిక్షకులు అభినందించారు.

సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం!

మందస: మందస మండలం సువర్ణపు రం సచివాలయం భద్రతను ఉద్యోగులు గాలికి వదిలేశారు. శనివారం సచివాలయం తెరిసిన ఉద్యోగులు అదే రోజు సాయంత్రం విధులు ముగించుకుని ఎవరికి వారే యమునా తీరు అన్న చందంగా తలుపులు వేయకుండా వెళ్లిపోయారు. ఆదివారం రాత్రి అటుగా వెళ్లిన గ్రామస్తులు సచివాలయం తలుపులు తెరిచి, లైట్లు వేసి ఉండటాన్ని చూసి అవాక్కయ్యారు.

విలువైన ఫైళ్లు, కంప్యూటర్లుగ్రీ, బీరువాలు, ఫర్నీచర్‌ చోరీకి గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు యువకులు తెరిచిన సచివాలయంలోకి వెళ్లి సెల్‌ఫోన్‌లో వీడియోలు తీస్తు సువర్ణపురం సచివాలయం భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ సోషల్‌ మీడియాలో పోస్టులు పెట్టి ట్రోల్‌ చేస్తున్నారు.



లైట్లు వేసిఉన్న సచివాలయం

మున్సిపల్‌ షాపుల అద్దెలు చెల్లించండి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలో ఉన్న ఐడీఎస్‌ఎంటీ షాపుల లీజుదారులతో మున్సిపల్‌ కమిషనర్‌ నడిపేన రామారావు సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లీజుదారులు, షాపు రూముల అద్దెలు బకాయిలు ఉన్న వాటిని తొందరగా చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో హైకోర్టు, లోకల్‌ కోర్టులో పెండింగ్‌లో ఉన్న షాపు యజమానులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ గుజ్జు అమర్‌, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్‌ రామారావు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ

టెక్కలి: ఇటీవల కాకినాడ జేఎన్‌టీయూలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో టెక్కలి క్రీడాకారులు ప్రతిభ చూపారు. ఎనిమిది స్వర్ణాలు, ఆరు వెండి, ఏడు రజత పతకాలు సాధించినట్లు కోచ్‌లు ఎస్‌.శేఖర్‌, పి.జగదీష్‌, టీమ్‌ మేనేజర్‌ పడాల అక్షా, ఆరంగి సాగర్‌లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాస్వని కృష్ణ సామి, మెండ తపస్వీ లు ఉత్తమ ఫైటర్‌లుగా ట్రోఫీతో పాటు కిట్‌ను సొంతం చేసుకున్నారు.

ముగిసిన ఉదాస్‌ గురునామ యజ్ఞం

ఇచ్ఛాపురం రూరల్‌: ఈదుపురం కంద్రావార్డులో ఆదివారం నుంచి జరుగుతున్న ఉదాస్‌ గురు అష్టపహరీ నామ యజ్ఞం సోమవారంతో ముగిసింది. ఆంధ్రా, ఒడిశా గ్రామాల శిష్య బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ

మందస: మందస మండలం హరిపురంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రథ సప్తమిని పురస్కరించుకుని దుస్తులు వితరణ చేశారు. హరిపురం కోస్టల్‌ లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షులు బైరిశెట్టి గున్నయ్య, ట్రెజరర్‌ మండేలా లక్ష్మణరావు పది మంది కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతినిధులు వైఎస్‌ఎన్‌ మూర్తి, పుల్లా వాసుదేవు పాల్గొన్నారు.